కొలిపాటి విజయలక్ష్మి

# బస్సులో బామ్మగారు



బస్సు ఓ జంక్షన్‌లో ఆగింది. రెండు చేతుల్లో రెండు సంచులు పట్టుకుని జనాన్ని తోసుకుంటూ బస్సులో పడింది ఓ ఎనభై యేళ్ల వృద్ధురాలు

"ఓ ముసలమ్మా డబ్బులియ్యి" తొందర చేస్తున్నాడు, ఆర్.టి.సి. కండక్టర్. మా ఊరికి ఈ ఆర్టీసీ బస్సులు టైముకి సరిగా రావు. వస్తే వరసగా గంటలో మూడు నాలుగు బస్సులు వచ్చేసి ఖాళీగానె పోతూంటాయి

ప్రయివేట్ బస్సులు అయితే రోడ్డు మీద మనిషి నిల్చుని చెయ్యిజాపి గోక్కున్నా ఆగిపోతాయి గాని ఆర్ టి సి బస్సు పది మంది ప్యాసింజరులు ఆపమని గోలెత్తినా ఆగదు. ఇంకా ప్రయివేటు బస్సు వాళ్ళు సర్దుకోండమ్మా సర్దుకోండి అని నచ్చజెప్పి జనాన్ని కూరేస్తారు కాని ఆర్ టి సి బస్సు కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నా ఒక్కోసారి అస్సలు ప్యాసింజర్లు లేకుండా దర్జాగా తన గమ్యస్థానానికి చేరుకోవటం కద్దు.

"ఉండవయ్యా ఇస్తాను. ఎవరికి ఇచ్చుకోక తప్పుతుంది?" అంటూ దబ్బున నా పక్కన చతికిలబడింది బామ్మగారు. వయస్సు నాకన్నా ఓ ముప్ఫయేళ్ళు ఎక్కువనిపించినా ఆమె నా కన్నా దృఢంగా ఆరోగ్యంగా ఉంది. అదృష్టవంతురాలు అనుకున్నాను.

ఉష్ హమ్మయ్య ఏదో మహాకార్యం నెరవేరినట్లు ఊపిరివదిలి మొలలో ఓ గుడ్డను చుట్టి దోపుకున్న చిన్న రేకు డబ్బా తీసింది.

కండక్టరు, "మామ్మా డబ్బు లియ్యి. ముసలమ్మా డబ్బులు" అని అరుస్తూనే ఉన్నాడు కొందరికి టికెట్టు కట్ చేసి ఇస్తూ.

ఆ డబ్బాలో కూరిన కాయితాలు తీస్తూ రెండు రెండు రూపాయల కాయితాలు అతని చేతిలో పెట్టింది బామ్మగారు.

"ఇంకా అర్ధరూపాయొస్తది" అన్నాడు కండక్టరు.

"చిల్లరలేనట్లుందే" గొణిగినట్లంది బామ్మగారు డబ్బాను మళ్ళీ గుడ్డనుచుట్టి మొల దోపుకుంటూ.

"చిల్లర లేకపోతే దిగిపో" అన్నాడు కండక్టరు ఖచ్చితంగా,

ఆమె బుజం మీది నుంచి లాగి ఎడమ వైపున దోపిన పమిట చెంగులాగి ఆ కొంగు ముడి విప్పి రెండు పావలా కాసులు తీసి చెయ్యి ముందుకు చాపింది

అప్పటికే కండక్టరు మా ముందు సీట్లో కూర్చున్నవాళ్ళతో పోట్లాడుతున్నాడు. నలుగురికి ఏదో స్టేషనుచెప్పి పదిహేను రూపాయలు తప్ప ఇవ్వలేనంటు ఆ నాయురాలు. "మరో ఐదు రూపాయలు వస్తాయి లేకపోతే దిగిపో" కసురుకున్నాడు కండక్టరు.

"బాబ్బాబు నాయనన్నాయన నీ బిడ్డలకి పుణ్యం" బ్రతిమిలాడటం మొదలు పెట్టింది నాయిరాలు.

"బస్ దిగండి ముందు మీరు" అరిచాడు గట్టిగా కండక్టరు.

బస్సాగిపోయింది. "ఎదవ గొడ ఎదవ సొద టిక్కెట్టుతీసుకు బస్సెక్కించవయ్యా అంటె ఇనవు నువు" విసుక్కుంటూ ముఖం చిట్లించాడు డ్రయివరు.

డోర్ పకదు ఎక్కిపోతారు దరువు అనే శాడు అందరిని కలిపి కండక్టరు.

"నవపడి బాబూ!" అంటూ నాయి రాలు బొడ్డున దోపిన చిక్కుముడి విప్పి అందు లోంచి ఐదురూపాయల కాయితం తీసి కండ క్టరు చేతిలో అణిచి పెట్టింది. అతనివైపు కనులెగరేసి చూస్తూ:

అతనామెకు టిక్కెట్టుకట్ చేసి ఇచ్చాడు టిక్ టిక్ మని అతను శబ్దం చేయగానే బస్ కదిలింది.

ఇవిగో డబ్బులు తీసుకు టిక్కెట్టు ఇయ్యి వయ్యా అంటే బామ్మగారు రెండు పావలా లున్న చెయ్యి ముందుకి చాపుతూ

ఈమె ఇవ్వటంలోనో, అతను తీసుకో వటంలోనో ఒక పావలా జారి కింద పడి పోయింది.

టక్కున క్రింద ఓ పావలా జారిపడిన శబ్దంవినని కండక్టరు "ఇంకో పావలాఇవ్వు ముసలమ్మా" అన్నాడు మరొకరికి టిక్కెట్టు డబ్బులు స్టేషను పేరు అడుగుతూ.

"నువ్వడిగిన అర్ధరూపాయి నేను ఇచ్చే శాను క్రిందపడిపోయింది కాళ్లకింద వెతుక్కో" అని ముఖం సరిగాతిప్పుకుని సామానులు కాళ్ళ దగ్గర సర్దుకుని దర్జాగా కూర్చుంది బామ్మ గారు.

"ఎతుక్కోమంటావా?" ఏడవలేక నవ్వి నట్లు నవ్వాడు కండక్టరు.

పాపం కండక్టరు. జాలేసింది నాకు అతని అవస్థ. కట్టుకున్న కాకీబట్టలు ఉక్కా, మొఖ మంతా కమ్ముకారే చెమట నీరు తుడుచు కోవటానికి కూడా అవకాశంలే అవస్థ. జనం రద్దీ. టిక్కెట్లు ఎవరికిచ్చారో ఎంద రికివ్వలేదోతెలియని పరిస్థితి. గతిలేక కండ క్టరుద్యోగం అనిపించింది.

ట్రయిబులు ఏరియాలలో అయితే వీళ్ళ పరిస్థితి మరీ అధ్వాన్నం. స్టేషన కానిచోట బస్సు ఆపకూడదని రూలు. ఇక్కడెందుకు ఆపవు మేమంటె అంత సులకన అని తగ వుకి దిగి రోడ్డుకడ్డం నిల్చి బస్సాపి జబర్ దస్తీగా బసెక్కి చిల్లరలేక పదిపైసలు కండక్టరివ్వలేకపోతే అతన్ని బండబూతులు తిట్టి కొట్టడానికికూడా సిద్ధమయ్యే గిరిజ నులు. ఈ ఉద్యోగాల్లో బి.ఎలు, ఎమ్.ఎలు చేరటానికి కూడా సిద్ధంగా ఉన్నారట.

ఎంత దురదృష్టకరం!

అందరి కాళ్ళక్రిందా'జరగండి జరగండి' అని పావలా వెతుక్కునే కండక్టరు టిక్కె ట్టియ్యవయ్యా కండక్టరూ అని వేదించే బామ్మగారు.

నాకు నవ్వొచ్చింది.

పావలా వెతుక్కుని టిక్కెట్టు కట్ చేసి బామ్మగారి చేతిలో ఉంచి, మళ్ళీ టిక్కెట్ టిక్కెట్ అంటూ తన పనిలో లీన మయ్యాడు కండక్టరు.

బామ్మగారి సంచులపై ప్రసరించాయి నా చూపులు. ఒక సంచిలో ఉతికిన బట్టలు ఓ సంచిలో రెండు సిలవరు డబ్బాలు.

"ఎక్కడికి వెళుతున్నారు బామ్మ గారూ" అడిగాను ఏదో ఆలోచనలో గంభీ రంగా ఉండిపోయిన బామ్మగార్ని.

"మెంటలాసపత్రికి" ఆమె జవాబు.

ఎందుకు? ఎవరున్నారక్కడ? అని నేను ప్రశ్నించేలోపల ఆమె అడిగింది నన్ను. మీ రెక్కడికి? అని.

మెడికల్ చెకప్‌కి వైజాగ్ అన్నాను.

చిన్నా పెద్దా ముతకా ముసలీ అని లేదు. ఇవేం పాడురోగాలో అందావిడ.

"మెంటలాసుపత్రి అన్నారు?" అని ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాను.

"మా అమ్మాయి ఉంది. బుధవారమె వెళ్ళాలి అదీ మూడు గంటలకే వెళ్ళాలి. ఈ బస్సు అందుతుందో లేదో అని తెల్లారగట్టే లేచి" అని ఆయాసంగా ఊపిరి పీల్చి వదిలి. "స్నానం జపం చేసుకుని తలుపు తాళం పెట్టుకుని నాలుగుమైళ్ళు నడిచివచ్చే సరికి ఈవేళ అయ్యింది. మీ ఇంటిపేరు?" అని ప్రశ్నించింది.

చెప్పాను.

"నిమ్మకాయ లెక్కడా దొరకటంలేదు. పిల్లని నిమ్మకాయ నీళ్ళలో పంచదార కలిపి తాగమన్నారట కొత్త వలసలో దిగి చూస్తాను ఉంటాయేమో! అక్కడనుంచి చాలా బస్సులు దొరుకుతాయిలెండి" అంది బామ్మగారు.

"మీ ఇంటిపేరు?" ప్రశ్నించాను.

చెప్పిందావిడ.

"ఫలానావారు అదే ఇంటిపేరు వారు నాకు పదేళ్ళ క్రితం పరిచయమైన ఆమె గుర్తువచ్చి." "ఆవిడ మీకు తెలుసా?" అడి గాను.

"అయ్యో! అది నా తోటి కోడలండీ చాలా మంచిది చచ్చిపోయింది" అందావిడ.

తరవాత వాళ్ళవివరాలు నేను ప్రశ్నించి తెలుసుకోవటం ఆమె మీకెందరు పిల్లలు ఏం చేస్తున్నారు. పెళ్ళిళ్ళు అయ్యాయా లాటి ప్రశ్నలువేసి జవాబులు విని సంతో షించటం జరిగింది


ఇహ బామ్మగారె మాట్లాడటం ప్రారం భించింది. వయసు మళ్లినవారు వారి గత జీవిత కథనాలు చెబుతూంటే వినటం నా కెంతో ఇష్టం.

"మా అబ్బాయి ఈ దగ్గర ఊళ్లోనే పని చేస్తున్నాడు. వాడికీ పిల్లలే!" ఆమె ఎందుకో ముఖం చిట్లించింది. ఆ ముఖంలో చీత్కారం నైరాస్యం కని పించాయి.

"అతని దగ్గర ఉండక ఆ పల్లెటూర్లో ఎందుకుంటారు మీరు? ఈ వయసులో పాపం" సానుభూతి వ్యక్తపరిచాను. ఆమె మాటమధ్యలో "భూములు వ్యవసాయం. చూస్తూంటాను. ఇల్లు వాకిలీ పల్లెటూర్లో సుఖంగాఉండేవారం. పట్నవాస కాపురాలు చెయ్యలేమండీ" అని అసహ్యం వ్యక్త పరుస్తూ తల అడ్డంగాఊపింది బామ్మగారు.

తరవాత మళ్ళీ చెప్పటం ప్రారంభం చింది. "అక్కడ గేటువాడికి మూడు రూపాయలిస్తేకాని లోపల అడుగుపెట్ట నివ్వడు. ఐదు రూపాయలు చేతిలో పెడితే నర్సమ్మ పిల్లతో మరో ఘడియ మాట్లాడ నిస్తుంది. ఏమిటి చెప్పమంటారు? అక్కడే ఓదానికి కాని ఇవ్వటం, బస్‌చార్జీలు రిక్షా డబ్బులు, వారానికి నలభై నలభైఐదురూపా యలు ఊడిపోతాయి. ఏమిటి చెయ్యటం "పాలకోసం రాళ్ళు మొయ్యటం" అని నిట్టూ ర్చింది. "పెద్దది నాగపూర్‌లో ఉంది. చిన్నది కలకత్తావైపు ఏదో ఆ ఊరిపేరు నాకు పలకదు. అక్కడుంది. ఇది అందరి కన్నా చిన్నది. ఐదుగురు మగపిల్లలు పై ముగ్గురూ ఫరవాలేదులెండి ఎదిగారు. కాని చిన్నవాళ్ళిద్దరూ ఒకడు పదేళ్ళవాడు, ఒకడు ఏడేళ్ళవాడు" అన్నప్పుడు ఆమె గొంతు పూడిపోయి కనులు నీరు చిమ్మాయి.

పవిటచెంగుతో కనులు వత్తుకుంది. ఏదో ఆమె గుండెల్లో లావా ఉడుకుతూంది.




"క్రిందటి వారం జంతికలు రసోక్కరాలూ చేసి పట్టుకెళ్ళాను. ఈ వారం రవ్వ లడ్డు, బర్ఫీముక్కలు చేసి తీసుకువెళుతున్నాను. దాన్ని తిననిస్తారో అక్కడి ముండలు తినేస్తున్నారో. తిన్నావటె అంటే తిన్నానంటుంది. వచ్చేస్తాను నీతో తీసుకుపోమ్మా! అని ఏడుస్తుంది. బాబూ మా పిల్లను వదిలెయ్యండి తీసుకుపోతానంటె దానికింకా జబ్బు కుదరలేదు. తీసుకుపోతె తీసుకుపో అని కసురుతారు డాక్టర్లు. అలా నేను తీసుకువచ్చేస్తే మళ్ళీ ఏమన్నా తిరగబడితే చేస్తుకోరట అదీ భయం."

"మీ అల్లుడూ పిల్లలూ వచ్చి చూసిపోతూంటారా?" అడిగాను.

"ఆ అతనో తిక్కమనిషి పెద్దవాడు వచ్చి చూసి వెళ్ళాడీమధ్య. వాళ్ళకి డబ్బులివ్వండి" అంది బామ్మగారు.

బస్సు స్పీడుగా పరుగెడుతోంది. బామ్మగారు తనకిసంబంధించినవాళ్ళందరూ ఎక్కడెక్కడున్నారో, ఎవరు మంచివాళ్ళో ఎవరు కాదో చెబుతూంది. కొన్ని మాటలు వినిపిస్తున్నాయి. కొన్నిమాటలు బస్సు హోరులో జనంగోలతో గాలిలో కలిసిపోతున్నాయి.

"కాలం మారిందమ్మా! వెధవ సినిమాలు పుస్తకాలు పిల్లల్ని పాడుచేస్తున్నాయి. పెద్ద వాళ్ళంటే గౌరవమర్యాద లుపోయాయ్. పేట్రేగిపోతున్నారు. అందరూ అనను. కొందరు మంచివాళ్ళూ ఉన్నారు. మాతోటి కోడలు అల్లుడూ కూతురూ ఉన్నారే నిజంగా చెప్పుకోవలసిన పిల్లలు. అతని తండ్రికి పక్షవాతం. తల్లికి మతి స్థిమితం లేదు. వాళ్ళిద్దరికీ ఎంత సేవచేశారో బిడ్డలు. ఆ పిల్ల ఉందే దేవతనుకోండి. మా పిల్లలూ బుద్ధిమంతులే అనుకోండి. ఏమంటారు? పిల్లలంటే ఏమిటో మమత చావదు. అని నాముఖంలోకి చూసి నవ్వబోయింది బామ్మగారు.

నేనూ ఓ వెకిలి నవ్వు నవ్వాను. అయితే ఓ తమాషా ఉంది.

ఆమె కొడుకు ఆమె పర్మిషన్ తీసుకోకుండానే ఓ చదువుకున్న అమ్మాయిని పెళ్ళి చేసుకు వచ్చాడంటే ఓర్చుకుందిబామ్మగారు. అయితే ఆ ఇంట్లో పట్టుమని పదిరోజులు కూడా ఉండలేకపోయింది. ఆ కోడలికి అంటూ ముట్టు తెలియదు సరికదా అత్తగారంటె ఒక రకమైన చిన్నచూపు. మీ అమ్మ మడి అని కోడలు వికగబడి నవ్వితే శ్రుతి కలిపే కొడుకు. ఆమెను పంపించేయండి నాకు మహాబోరుగా ఉంది. అంటె అమ్మా? నువెళ్ళి మన ఊళ్ళో వ్యవసాయం చేసుకోరాదూ! అన్నాడో రోజు కొడుకు.

బోరంటే ఏమిటండి! అడిగింది పక్కింటి పద్మావతిని. ఆమె ఆపదానికి అర్థంచెప్పింది. మూటా ముల్లె సర్దుకుని తమ స్వంతగ్రామానికి చేరుకుంది బామ్మగారు. ఎప్పుడయినా ఆ కొడుకుని, పిల్లల్ని చూసి పోవటమేకాని ఆ ఇంట్లో ఉండదు. ఆకోడలు ఆడపిల్లల్ని అత్తగార్ని ఆదరించదు. అల్లుళ్ళు కూతుళ్ళని సాధిస్తారు కూతుళ్ళు తల్లి దగ్గర కన్నీరు కారుస్తారు. తృణమో ఫణమో వారిచేతిలో ఉంచి ఓదార్చి పంపుతుందా ముసలి తల్లి. భర్త బాధింపు భరించలేక మతిచెడి హాస్పిటల్లో చేరిన కూతుర్ని చూడటానికి వారం వారం ఏదో తినుబండారాలుచేసి కూతురుకిచ్చి ఆమె దగ్గర మాసిన బట్టలు తీసుకుని ఉతికి బట్టలిచ్చి అక్కడవారికి లంచాలు సమర్పించి తన కూతుర్ని కొట్టవద్దని బ్రతిమిలాడి, కన్నీరు వత్తుకుంటూ తిరిగి స్వగ్రామం చేరుకుంటుంది.

ఇవ్వేమి చెప్పలేదు బామ్మగారు. మావూరు వచ్చాక బామ్మగారి వూరి అమ్మాయి మా వూళ్ళో ఓ ఇంటి వారి కోడలు. బామ్మగారు నీకు తెలుసా! అని ప్రశ్నించి ఈ కథంతా చెప్పి పాపం అని సానుభూతి వ్యక్తంచేసి దేవుడి దయవల్ల ఆ ఆస్తి ఆమె కన్నవారు ఇచ్చినది కాబట్టి సరిపోయింది. కాని, తండ్రిదయితే ఆ కొడుకులాక్కొండే. అప్పుడు ముసలమ్మపాట్లు చెప్పాలా? అంది.

బామ్మగారు తమ ఇంటిగుట్టేమీ చెప్పకుండానే ఆ కబురు ఈ కబురు చెప్పి స్టేషనురాగానే రెండు సంచులూ పట్టుకుని అదరాబాదరా బస్సు దిగిపోయింది.

బస్సు కదుల్తూంటే కిటికీలోంచిచూశాను నిమ్మకాయల దుకాణంవైపు నడుస్తూన్న బామ్మగార్ని.

ఆమె వేసిన ప్రశ్నలకు ఎంత తియ్యని జవాబు ఇచ్చాను? ఆవిడకున్న సమస్యలు నాకూ ఉన్నాయి. అయినా నేను చెప్పలేను. సున్నితమయిన నా మనస్సు తట్టుకోలేక, ఆటుపోటులెన్నో! ఆరోగ్యం చెడగొట్టుకున్నాను.

కాని బామ్మగారు?

ఎనభైయేళ్ళు దాటిన ఆమె ఇన్ని సమస్యల నెదుర్కొంటూ ఎంత నిబ్బరంగా కనుపిస్తూంది? ఆమె ఏడుస్తూనే పండగలు ఉపవాసాలూ స్నానాలూ జపాలూ చేస్తుందట.

దీపావళి వచ్చినా ఏ పండగ వచ్చినా నాలో పెద్ద ఉత్సాహముండదు. ఒకవేళ పండగ పద్ధతి నేను చేద్దామనుకుంటే పిల్లలు ముక్కునే పిల్లలు చీదరించుకునే భర్త.

బామ్మగారు పొంగరాలు పోసి రైతులకు, పనివాళ్ళకూ పంచి దేవుడి దగ్గర దీపం వీధిగడపలో ఓ దీపం పెరట్లో తులశమ్మదగ్గర గొడ్లపాకలో ఓ దీపం పెట్టి ఆ పల్లెవాళ్ళు చేసుకునే దీపావళీ సంబరాలు చూసి ఆనందిస్తుందట. తడికళ్ళతో నవ్వుతుందట.

*ధర్మతంత్రుడగుచు కమలాక్షు గొలుచుచు ఉభయనియత వృత్తినుండెనేని,* అన్నట్లు బామ్మగారు. తామరాకు మీద నీటిబొట్టు ఏమో!

నేను మాత్రం సమస్యలను స్వజనుల తిరస్కారాలనూ భరించలేక రోగిష్టి రాలినై పోయాను.